క్లుప్తంగా

రుచి, శుచి తప్పనిసరి



భోజనం చేస్తున్న డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో మెనూ పక్కాగా అమలుచేయాలని, రుచిగా, శుభ్రంగా ఉండాలని డిప్యూటీ ఈఓ తిరుమల చైతన్య అన్నారు. మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ నెల 21 నుంచి రాగి జావ విద్యార్థులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. పదో తరగతికి చెందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పరీక్షల సన్నద్ధతపై చర్చించారు. విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలను తొలగించారు. సరైన ఆహారం, మానసిక ఆత్మస్థైర్యం కలిగించాలన్నారు. హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

డీ వార్మింగ్ డే విజయవంతం చేయండి



ఆల్బెండజోల్ మాత్రలను హెచ్ఎంలకు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆమదాలవలస: ఈ నెల 14న నిర్వహించనున్న నేషనల్ డీ వార్మింగ్ డేను (ఎన్‌డిడి) విజయంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు అన్నారు. మున్సిపల్ పరిధిలో గల విద్యార్థులకు నులుపురుగు నివారణ మాత్రలను (ఆల్బెండజోల్) హెచ్ఎంలకు మెడికల్ సిబ్బంది ద్వారా మున్సిపల్ కార్యాలయంలో శనివారం అందజేశారు. మాత్రలను ఏ విధంగా వేయాలో వివరించారు. ఫార్మాసిస్ట్ చింతాడ వరుణ్‌కుమార్, రామకృష్ణ, అర్బన్ హెల్త్ సెంటర్‌లకు సంబంధించి వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్య, మున్సిపల్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం



రైతులు హతమార్చిన కొండచిలువ

పోలాకి: మండలంలోని మబగాంలో చెరకు తోటల్లో సుమారు 20 అడుగుల కొండచిలువను శనివారం రైతులు హతమార్చారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పక్కనే ఉన్న కొండచిలువను చూసి అటుగా వెళ్లిన స్కూల్‌పిల్లలు భయాందోళనకు గురయ్యారు. మరికొంతమంది అక్కడి చేరి చూసేసరికి అప్పటికే చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. నదీతీర గ్రామం కావటంతో వరదల సమయంలో కొండ ప్రాంతం నుంచి ఇటువంటి పాములు కొట్టుకొస్తుంటాయని చెబుతున్నారు.

గడ్డికుప్పలు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి కుప్పలు

సారవకోట: మండలంలోని గుమ్మపాడు గ్రామంలో శుక్రవారం రాత్రి ఐదెకరాల గడ్డి కుప్పలు దగ్ధమైయ్యాయి. గ్రామానికి చెందిన కౌలు రైతులు దండి వరాలు, కత్తిరి మోహన దాస్‌కు చెందిన గడ్డికుప్పలు కాలిబూడిదయ్యాయి. కోటబొమ్మాళి నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపుచేశారు. కావాలనే కొంతమంది తమ గడ్డికుప్పలకు నిప్పుపెట్టారని మోహనదాస్ ఆరోపిస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు ముందుభాగం

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పలాస వైపునుంచి మెళియాపుట్టి వైపు కారు వేగంగా దూసుకువస్తూ అదుపుతప్పి చాపర మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. సేఫ్టీ బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. హిరమండలం మండలానికి చెందిన వారుగా తెలుస్తుంది. అర్ధరాత్రి జనసంచారం లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ అధికారులు సమాచారం అందుకుని రాత్రికి రాత్రే మరమ్మతులు చేశారు.

పొరుగు మురుగుతో.. అవస్థలు

- సరిహద్దు గ్రామాలను ముంచెత్తుతున్న మురుగునీరు, వ్యర్థాలు
- నష్టపోతున్న రైతులు
- గత పదేళ్లుగా ఇదే పరిస్థితి..



ఒడిశా మురుగునీరు పంట పొలాల్లో చేరడంతో పెగిలిన పిచ్చిమొక్కలను చూపిస్తున్న రైతు

పాతపట్నం: ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి పట్టణంలోని మురుగునీరు ఆంధ్రా సరిహద్దు గ్రామాలను ముంచెత్తుతోంది. ఆంధ్రా వైపు వస్తున్న కాలువల్లో పూడికలను అక్కడి ప్రభుత్వం జేసీబీలతో తీయిస్తుంది. ఆ వ్యర్థాలు కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాల్లోకి వచ్చి చేరుతుంది. సుమారు 40 ఎకరాల్లో పంట పొలాలు మురుగునీటితో నిండిపోతున్నాయి. గత పదేళ్లుగా ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ఆంధ్ర, ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా.. వారి నుంచి స్పందన లేకపోవడంతో సరిహద్దు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



ఒడిశా మురుగునీటితో నిండిన ఆంధ్రా పంట పొలాలు



ఒడిశా నుంచి ఆంధ్రాలోకి వస్తున్న మురుగుకాలువ

పొలంలో కాలు పెట్టలేకపోతున్నాం



లక్షల రూపాయల విలువైన భూముల్లో మురుగునీరు, చెత్తాచెదారం చేరడంతో పంటలు వేసుకోలేకపోతున్నాం. పొలంలో కాలుపెడితే గాజు పెంకులు గుచ్చుకుంటున్నాయి. గత పదేళ్లుగా పంట వేయలేకపోయాం.

– గుర్రాల రాములు, రైతు, హరిజనగోపాలపురం

పంటలు వేయలేకపోతున్నాం



మా భూములను ఒడిశా మురుగునీరు ముంచెత్తుతుండడంతో పంటలు వేసుకోలేకపోతున్నాం. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. కనీసం పొలం వద్దకు వెళ్లలేకపోతున్నాం. ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు.

– అమిటి బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు, హరిజనగోపాలపురం

ఉన్నతాధికారులకు తెలియజేస్తాం..



రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ విషయాలన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ఆంధ్రా సరిహద్దులో కాలువను తవ్వనీయకుండా చర్యలు తీసుకుంటాం. పంట పొలాల్లో మురుగునీరు రావడంతో రైతులు ఎంతో నష్ట పోతున్నారు.

– కె.రవిచంద్ర, తహసీల్దార్, పాతపట్నం

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ఎస్ఐ కృష్ణప్రసాదును సత్కరిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

సరుబుజ్జిలి: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాదు తెలిపారు. స్థానిక వెంకటసాయి జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల నడవడికతోనే చదువుకున్న సంస్థకు, తల్లిదండ్రులకు మంచిపేరు వస్తుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ కూన జగన్నాథం, ప్రిన్సిపాల్ బెండి పురుషోత్తమరావు, హిరమండలం ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్లీల చిత్రాలను నిషేధించాలి

నరసన్నపేట: సోషల్ మీడియాలో అశ్లీలత పెరిగిపోతుందని, యువత చెడు మార్గాల వైపు మళ్లే ప్రమాదం ఉందని, వీటిని వెంటనే నిషేధించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.యుగంధర్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం వీరు నరసన్నపేటలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మెడికల్ మాఫియా ఆగడాలు అధికవుతున్నాయని, వైద్యాధికారులు, ఔషధ నియంత్రణ మండలి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలన్నారు. నరసన్నపేట ఏఐవైఎఫ్ నాయకులు సాంబశివరావు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల భవనానికి స్థలం కేటాయించాలి



స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఆమదాలవలస: ఆమదాలవలస ట్రెజరీ పరిధిలో గల సుమారు 1200 మంది విశ్రాంద ఉద్యోగుల కోసం పట్టణంలోని కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు ఎస్.సిమ్మినాయుడు కోరారు. ఈ మేరకు శనివారం ఆమదాలవలస పట్టణంలో స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసి వినతిపత్రాన్ని అందించారు. విశ్రాంత ఉద్యోగులు సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు భవనం అవసరమని తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో సంఘం గౌరవ అధ్యక్షుడు బి.మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలు, నమూనా కరపత్రాల పంపిణీ

ఆమదాలవలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆమదాలవలస పట్టణంలో జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ ఓటర్ జాబితాలు, నమూనా కరపత్రాలను పార్టీ నాయకులు, కార్యకర్తలకు శనివారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



కరపత్రాలు, ఓటర్ జాబితాలు అందజేస్తున్న చింతాడ రవికుమార్

సుదర్శన్ కుటుంబానికి పరామర్శ



సుదర్శన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తహసీల్దార్

బూర్జ: మండలంలో గల నీలాదేవిపురం గ్రామానికి చెందిన దళిత నాయకుడు జమ్మాన సుదర్శన్ ఇటీవల ఓ.వి.గ్రామ పరిధిలోని తోటల్లో హత్యకు గురైన విషయం తెలిసిందే. సుదర్శన్ కుటుంబాన్ని స్థానిక తహసీల్దార్ ఎస్.రమణారావు శనివారం పరామర్శించారు. కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది, మృతుడు సుదర్శన్ తండ్రి జె.దుర్గారావు, తల్లి జె.పోలమ్మ, భార్య స్వర్ణలత, చెల్లెలు వేణు, జె.సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామం ఉమాకామేశ్వర స్వామివారి ఆలయం ఆవరణలో శనివారం సుబ్రహ్మణ్యస్వామి సమేత నాగేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట శనివారం నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగవరపు వాసుదేవశర్మ, విగ్రహదాత సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటినుంచి పైడితల్లి అమ్మవారి జాతర

పొందూరు: ఉత్తరాంధ్ర భక్తుల కల్పవల్లి పొందూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారి 38వ యాత్ర ఆదివారం నుంచి ప్రారంభమవుతోంది. మూడు రోజులపాటు యాత్రను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ జాతరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు రానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు రోజంతా అన్నసమారాధనను వ్యాపారవేత్త కాకర్ల పైడిలింగం ఏర్పాటు చేయడం అనవాయితీగా వస్తుంది.

నేటినుంచి ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండలంలోని గుమ్మపాడు గ్రామంలోని మల్లేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించనున్నామన్నారు. ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు, స్వామి వారి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ఒత్తిడికి గురికావొద్దు

నరసన్నపేట: పరీక్షల సమయంలో విద్యార్థులను తల్లిదండ్రులు ఒత్తిడికి గురి చేయవద్దని హెచ్ఎం హర్షవర్ధన్ శర్మ అన్నారు. ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులను మానసికంగా ఆత్మస్థైర్యాన్ని కల్పించాలన్నారు. మంచి ఆహారం ఇవ్వాలని, పిల్లలు చదువుతున్న తీరును గమనించాలన్నారు. ఈ పరీక్షలు జరిగే అన్ని రోజుల్లో ఇళ్లల్లో టీవీలు వేయవద్దని, మంచి వాతావరణం ఉండేలా చూడాలన్నారు. సుందరాపురం, బాడాం, బొరిగివలస, సత్యవరం, కంబకాయ స్కూళ్లల్లోనూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

జలుమూరు: జోనంకిలోని అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నారుఆ. ఈ మేరకు ఆలయ అర్చకుడు సారవకోట విశ్వేశ్వరరావు శనివారం తెలిపారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరగనుందన్నారు.

పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల

హిరమండలం: మండలంలోని హిరమండలం–2 ఎంపీటీసీ ఎన్నికకు సంబంధించిన పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను శనివారం ఎంపీడీఓ బొడ్డేపల్లి శైలజ విడుదల చేశారు. స్థానిక పాతహిరమండలం ప్రాథమిక పాఠశాలలో 22, 23, 24, 25వ, ఆర్టీసీ ఆర్అండఆర్ కాలనీలోని గ్రంథాలయంలో 26వ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

బూర్జ: పాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులతో హెచ్ఎం మాలతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారిగా ఇప్పటివరకు చెప్పిన సిలబస్‌ను వివరించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలు వివరించే సరికి ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. గత సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు 26 మంది ఫెయిల్ అయిన విషయం గుర్తుచేశారు. ఆమె పాఠ్యాంశాలు చక్కగా బోధించడంలేదని హెచ్ఎంకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయురాలును ఇక్కడి నుంచి మార్చాలన్నారు. ఈ సందర్భంలో ఉపాధ్యాయురాలు ఇక్కసారిగా కుప్పకూలిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి

సారవకోట: పరీక్షల సమయంలో విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఎంఈఓ ఎం.వి.రమణ సూచించారు. అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. పరీక్షల సమయంలో ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. హెచ్ఎం విలియమ్స్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మద్యం దుకాణాల బంద్



మూసివేసిన మద్యం దుకాణం

కొత్తూరు: ఉత్తరాంధ్ర పట్టభద్రులు, స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13న జరుగుతున్నందున కొత్తూరు సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు శనివారం నుంచి 13 తేదీ సాయంత్రం అర గంటలు వరకు బంద్ చేయించనట్లు ఎస్ఐ డి.ప్రభాకరరావు తెలిపారు. ఎన్నికల్లో ఎక్కడైనా మద్యం, నాటు సారా అమ్మకాలు, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే అనుమానం ఉన్నచోట్ల నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పరీక్షలంటే భయం వీడాలి

హిరమండలం: పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీలను శనివారం తనిఖీ చేశారు. పలు పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న క్రమంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుడదన్నారు. ప్రణాళిక ప్రకారం సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థులు, తల్లిండ్రులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఎంఈఓ కె.రాంబాబు, హెచ్ఎం యు.ఎస్.ఎన్.మూర్తి, కేజీబీవీ ఎస్ఓ కృష్ణవేణి ఉన్నారు.

కొత్తూరు: మండలంలోని పారాపురం, కుంటిభద్ర కాలనీ, కుంటిభద్ర ఉన్నత పాఠశాలలను డీఈఓ పగడాలమ్మ తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. జిల్లాలో ఈ రెండు పాఠశాలలు ప్రత్యేక గుర్తింపు పొందాయన్నారు.



హిరమండలం: కేజీబీవీ విద్యార్థులకు సూచనలిస్తున్న డీఈఓ పగడాలమ్మ

పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఏప్రిల్ మూడో తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో 29,575 మంది విద్యార్థులు 149 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. కుంటిభద్ర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎంఈఓ రాంబాబు, హెచ్ఎం డీఎల్ నరసింహం ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

పొందూరు: ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 10 పోలింగ్ కేంద్రాలు, పాతపట్నం నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు 6, నరసన్నపేట నియోజకవర్గంలో 7 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆమదాలవలస నియోజకవర్గంలో 8,015 మంది, నరసన్నపేట నియోజకవర్గంలో 6,043 మంది, పాతపట్నం నియోజకవర్గంలో 5,033 మంది ఓటర్లు ఉన్నారు.

బూర్జ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ఎస్.రమణారావు తెలిపారు. ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో 1287 మంది ఓటర్లు ఓటు వేయనున్నట్లు చెప్పారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ బి.మురళీమోహన్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రం–22లో 760 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సారవకోట: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టినట్లు తహసీల్దార్ ప్రవల్లికాప్రియ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రంలో మౌలిక వసతులను పరిశీలించి, ఎన్నికల రోజు తీసుకోల్సిన చర్యలపై ఎస్ఐ అప్పారావుతో చర్చించారు. 1102 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు.



సారవకోట: పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం చివర రోజు కావడంతో జోరుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పట్టభద్రులకు పోలింగ్ కేంద్రం, చిరునామాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: పద్మ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కొత్తూరు: అద్దంగిలో ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చింతా సూర్యనారాయణ, పార్టీ నాయకులు



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస రూరల్: సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆమదాలవలస: నిమ్మతొర్లువాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నరసన్నపేట: గాంధీనగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: ప్రహరాజపాలెంలో ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కొత్తూరు: గూనభద్ర ఆర్ఆర్ కాలనీలో ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, పార్టీ నాయకులు



బూర్జ: ఓ.వి.పేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు